ఆటల్లో మేటి.. పతకాల కోసం పోటీ..

- ప్రతిభ చాటుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



అనపర్తి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బాస్కెట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

అనపర్తి: వారంతా గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుపేద విద్యార్థులే.. ప్రభుత్వ పాఠశాలలో విద్య నభ్యసిస్తున్నారు. రెక్కల కష్టంతో కుటుంబాలను పోషిస్తున్న తల్లిదండ్రుల శ్రమను అర్థం చేసుకున్న ఆ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి క్రీడల్ని ఎంచుకున్నారు. అందుబాటులో ఉన్న వసతులు, అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ తల్లిదండ్రులు, గురువుల ప్రోత్సాహంతో మండల, జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయిలో పోటీలకు ఎంపికై అందరి ప్రశంసలు అందుకున్నారు. జాతీయ స్థాయిలో రాణించి క్రీడా కోటాలో ప్రభుత్వ కొలువు సాధించడమే తమ లక్ష్యమంటున్న ఆ క్రీడాకారుల మనోభావాలివి..

ప్రభుత్వ కొలువు సాధించడమే లక్ష్యం



మా అమ్మానాన్నలు వ్యవసాయ పనులు చేసుకుంటూ కష్టపడి చదివిస్తున్నారు. బాస్కెట్‌బాల్‌పై మక్కువతో ఈ ఆటలో జిల్లా స్థాయి పోటీల్లో రాణించడం ద్వారా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. క్రీడల్లో రాణించి స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే నా లక్ష్యం.

– ఎస్.ఐశ్వర్య, అండర్–14 బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, అనపర్తి

జాతీయస్థాయిలో రాణిస్తా



నేను అనపర్తి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాను. చిన్నప్పటి నుంచి బాస్కెట్‌బాల్‌పై ఆసక్తి పెంచుకున్నాను. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుల సూచనల మేరకు సాధన చేస్తూ మండల, జిల్లా స్థాయి పోటీల్లో రాణించి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నా. బాస్కెట్‌బాల్ క్రీడలో జాతీయ స్థాయిలో రాణించాలన్నదే నా ఆశయం.

– బి.జయరాజు, అండర్–14 బాస్కెట్‌బాల్ ప్లేయర్, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, అనపర్తి

క్రీడా కోటాలో పోలీసు ఉద్యోగమే లక్ష్యం



నేను అనపర్తి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాను. క్రీడలంటే చాలా ఇష్టం. బాస్కెట్‌బాల్‌లో నా ఆటతీరు గుర్తించిన పాఠశాల పీఈటీ నాకు మరింత శిక్షణనిచ్చారు. దీంతో అండర్–14 జిల్లా స్థాయి పోటీలో రాణించి ప్రస్తుతం అండర్–17 బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్నాను. జాతీయ స్థాయి పోటీల్లో రాణించి క్రీడా కోటాలో పోలీసు ఉద్యోగం సాధించడమే నా లక్ష్యం.

– ఎం.కృష్ణప్రసాద్, బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, అనపర్తి

ఉత్తమ క్రీడాకారిణిగా గుర్తింపు



అనపర్తి జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాను. వ్యాయామ ఉపాధ్యాయుల స్ఫూర్తితో టెన్నికాయిట్, బాక్సింగ్ పోటీల్లో రాణిస్తున్నాను. టెన్నికాయిట్‌లో రెండుసార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. బాక్సింగ్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. ఆ పోటీల్లో సత్తా చాటి పాఠశాలకు మంచి పేరు తీసుకు రావడంతో పాటు జాతీయ స్థాయిలో ఉత్తమ క్రీడాకారిణిగా గుర్తింపు తెచ్చుకోవాలన్నదే నా లక్ష్యం.

– జి.మౌనిక, అనపర్తి జెడ్పీ బాలికోన్నత పాఠశాల

నిరంతర సాధన



పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నిరంతరం సాధన చేస్తూ అండర్–17 బాస్కెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొని ఉత్తమ ఆటతీరుతో గుర్తింపు తెచ్చుకోవడమే లక్ష్యం. క్రీడా విభాగంలో మంచి ఉద్యోగం సాధించి కుటుంబానికి అండగా నిలవాలన్నది నా ఆశయం.

– వి.లక్ష్మి, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, అనపర్తి

క్లుప్తంగా

వెయ్యి మందికి వైద్యసేవలు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో సోమవారం నిర్వహించిన మెగా వైద్యశిబిరంలో వెయ్యి మందికి వైద్యసేవలు అందించారు. ఎస్ఆర్ఐ డాక్టర్ యన్నమని రామచంద్రరావు ఆధ్వర్యంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఈ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వెయ్యిమంది రోగులకు వైద్య సేవలు అందించారు. 30 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. 15 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించి, వారికి శస్త్రచికిత్సకు తరలించారు. కార్యక్రమంలో యన్నమని వెంకట నారాయణ, క్రొవ్విడి నరసింహరావు, వై.నాని, కె.శ్రీనివాసరావు, చంటిబాబు పాల్గొన్నారు.

ఘనంగా రథం ప్రారంభం



ఆరికరేవులలో రథం ప్రారంభిస్తున్న దాతలు

బిక్కవోలు: ఆరికరేవుల గ్రామంలోని శివాలయానికి దాతలిచ్చిన రథానికి సోమవారం ప్రారంభోత్సవం చేశారు. గ్రామానికి చెందిన తొండాపు సూర్యనారాయణరెడ్డి, లత దంపతులు రూ.12 లక్షలతో రథం తయారుచేయించి ఆలయానికి అందించారు. ఈ సందర్భంగా రథానికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు తొండాపు గాంధీ, సర్పంచ్ రెడ్డి నాగవీరవేణి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గురు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా విద్యనభ్యసించాలి

రాజానగరం: ప్రణాళికాబద్ధంగా విద్యను అభ్యసిస్తూ, ఎంచుకున్న లక్ష్యాలను సాధించే దిశగా పయనించాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ తెలుగు అధ్యాపకుడు డాక్టర్ తలారి వాసు విద్యార్థులకు సూచించారు. దివాన్ చెరువులోని వీజేస్ ఫార్మసీ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఫార్మసీ ఫస్టియర్ విద్యార్థుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చడం, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావడం ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యంగా భావించాలన్నారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ సీపీ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.నరేంద్ర, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్‌వీ జగన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం పైడిరాజు తదితరులు

బిక్కవోలు: గత నెల 29, 30 తేదీల్లో కడప జిల్లా ప్రొద్దుటూరులో జరిగిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన బిక్కవోలు ఉన్నత పాఠశాల విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం పైడిరాజు అభినందించారు. సోమవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. జట్టుకు ప్రాతినిధ్యం వహించిన పాఠశాలకు చెందిన ప్రసన్న భార్గవి, బండారు చాందిని, దుల్ల అలేఖ్య, హేమంత దుర్గ, జయంత్‌వీర నాగేంద్ర, బొడ్డు వెంకట వినయ్‌లను ఆయన అభినందించారు. బి.ప్రసన్న భార్గవి, అలేఖ్యలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు.

అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉమామహేశ్వరరావు



ఉమామహేశ్వరరావు

పెదపూడి: మండలంలోని గ్రామ పంచాయతీ సిబ్బంది, కార్యదర్శుల అసోసియేషన్ అధ్యక్షుడిగా శహపురం గ్రామానికి చెందిన యాళ్ల ఉమా మహేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మన్యం శ్రీనివాస్‌చౌదరి తెలిపారు. ఉపాధ్యక్షుడిగా బి.ప్రసన్నకుమార్, సెక్రటరీగా కేవీఎస్ సూర్యలక్ష్మి, కోశాధికారిగా మనోజ్ సాయి తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. నూతన కార్యవర్గానికి ఎంపీడీఓ పి.విజయభాస్కర్, ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు త్రినాథ్, ఎస్‌వీఆర్ స్వామి, అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

అనపర్తి: స్థానిక శారదా సంగీత కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న త్యాగరాజ ఆరాధనోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపం ఆవరణలో ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాల్లో భాగంగా తొలిరోజు మంగళవారం ప్రవచన చక్రవర్తి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుచే ×భక్తి వైభవం× ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

అతిథి అధ్యాపకుడికి దరఖాస్తుల ఆహ్వానం

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్రం బోధించడానికి అతిథి అధ్యాపకుడి నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ గణితంలో 55 శాతం మార్కులతో ఎమ్మెస్సీ ఉత్తీర్ణులైనవారు అర్హులని, పీహెచ్‌డీ, నెట్, ఏపీ సెట్ వంటి అదనపు అర్హతలకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. నెలకు రూ.28 వేలు గౌరవ వేతనం ఇస్తామన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 5 వరకు గడువు ఉందన్నారు.

కబడ్డీ విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న వీరబాబు

సీతానగరం: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ నాయకుడు, జిల్లా కార్యదర్శి పలివెల వీరబాబు అన్నారు. సోమవారం చిన కొండేపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో కబడ్డీ పోటీల విజేతలకు బహుమతులను ఆయన ప్రదానం చేశారు. హెచ్‌ఎం అద్దేపల్లి సత్యనారాయణ, మేకల రాజు, సీపీఐ ఎంఎల్ జిల్లా కమిటీ నాయకుడు నందమూరి చిట్టిస్వామి, మండల మహిళా కమిటీ అధ్యక్షురాలు పలివెల జ్యోతి పాల్గొన్నారు.

రాష్ట్రంలో జగనన్న సంక్షేమ విప్లవం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- కోరుకొండ నరసన్నకు పూజలు



కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అన్నప్రసాద వితరణ చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి పథకాలు అమలు చేస్తూ సీఎం జగన్ రాష్ట్రంలో సంక్షేమ విప్లవం సృష్టించారని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. సోమవారం కోరుకొండ నరసింహ స్వామిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చక స్వాముల మంత్రోచ్చారణతో ఎమ్మెల్యే రాజాను ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జగనన్న పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను గుర్తించి వాటి పరిష్కారంలో భాగంగా నవరత్నాలను అమలు జరుపుతున్నారన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామిని కోరుకున్నట్టు తెలిపారు. ముందుగా ఆయన తలనీలాలు సమర్పించారు.



సీతానగరంలో వేణుగోపాలస్వామి

తరలివచ్చిన భక్తులు

ముక్కోటి సందర్భంగా లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. తెల్లవారుజామునే పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రంగరాజ బట్టర్, అర్చక స్వాములు పెద్దింటి చంటిబాబు, పెదపాటి గిరిధర్, కోరుకొండ ఎంపీపీ ఉల్లి వీరవెంకట సత్యసూర్యకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ముక్కోటి ఏకాదశి

సీతానగరం: ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సీతానగరంలోని విష్ణాలయంలో కొలువైన రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామికి ఆలయ అర్చకుడు కేశవాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ధర్మదాయ, దేవదాయశాఖ ఈవో సోమాల శివ, ఆలయ కమిటీ చైర్మన్ సలాది వాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కొడమంచిలి శ్యామలరావు గురుస్వామి, రాముస్వామి ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం జరిపారు. వంగలపూడిలోని సీతారామస్వామి, రఘుదేవపురం దాసాంజనేయస్వామి ఆలయాలకు భక్తులు తరలివచ్చారు. జాలిమూడిలోని లక్ష్మీనరసింహస్వామి, మునికూడలిలోని సత్యభామా రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయాలు కిటకిటలాడాయి.

నేత్ర పర్వం.. ఉత్తర ద్వార దర్శనం

- వైభవంగా ముక్కోటి ఏకాదశి పూజలు
- భక్తులతో ఆలయాల కిటకిట

అనపర్తి: పుష్యమాసంలో వచ్చే శుక్లపక్ష ఏకాదశి ముక్కోటి ఏకాదశి. సోమవారం ఉత్తర ద్వారం ద్వారా వేంకటేశ్వరుని దివ్య మంగళరూపం భక్తులకు కనువిందు చేసింది. ఆలయాలన్నీ గోవింద నామ స్మరణతో మారుమోగాయి. స్థానిక పాతవూరులో గల జనార్దన స్వామిని చామంతి పూలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. స్థానిక మార్కండేయపురంలోని భావనాఋషి సమేత భద్రావతి సమేత దుర్గామల్లేశ్వర స్వామి ఆలయం, పొలమూరు వేంకటేశ్వర స్వామి, అనపర్తి కెనాల్ రోడ్డులో గల వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు.

బిక్కవోలు: బిక్కవోలు గ్రామంలో నంబోరు గుడి వద్ద లక్ష్మీనారాయణస్వామి, పందలపాక తుల్యాభాగనదీ తీరాన వెలసిన అలివేలు మంగాదేవి, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు.

బిక్కవోలు లక్ష్మీనారాయణస్వామిని గరుడ వాహనంపై ఊరేగించారు. బ్యాంకు వీధిలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్షతులసి పూజలు చేశారు. కొంకుదురులో బుడతలమామిడి వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. బలభద్రపురం శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం ఉత్తర ద్వారంలో భక్తులు స్వామి దర్శించుకున్నారు.



బిక్కవోలులో గరుడ వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనారాయణ స్వామి



అనపర్తి రామాలయంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు భాస్కరాచార్యులు

క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే

బిక్కవోలు: కాపవరంలో స్నేహ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్యాట్ చేతబట్టి కాసేపు క్రికెట్ ఆడి సందడి చేశారు. కాపవరం జట్టుకు సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ సమకూర్చిన టీషర్ట్‌లను ఎమ్మెల్యే చేతుల మీదుగా క్రీడాకారులకు అందజేశారు. నియోజకవర్గస్థాయిలో మొత్తంగా 46 టీమ్‌లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు.



క్రీడాకారులకు టీషర్ట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పర్యావరణ పరిరక్షణకు సైకిల్ యాత్ర



సైకిల్‌పై యాత్ర చేస్తున్న మిత్రులు

రాజానగరం: పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అంటూ ఇద్దరు మిత్రులు కాశ్మీర్ నుంచి పూణే వరకు సైకిల్ యాత్రను చేపట్టారు. జాతీయ రహదారి మీదుగా విజయవాడ వైపుగా వెళ్తున్న కాశ్మీర్‌కి చెందిన మిలాస్ కుమార్, పరదేశీ సోమవారం రాజానగరం చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలుష్యం పెరిగిపోవడంతో ఆరోగ్యకర పంటలను పండించలేకపోతున్నామన్నారు. కాలుష్య నియంత్రణపై ప్రజలలో చైతన్యం రావడం కోసం కాశ్మీర్‌లో సైకిల్ యాత్ర ప్రారంభించామన్నారు. ఇంతవరకు 3400 కిలోమీటర్లు ప్రయాణించామని, మరో 3600 కిలోమీటర్లు వెళ్లాల్సి ఉందన్నారు..

చంద్రబాబు ప్రచారయావకు అమాయకులు బలి

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి, చిత్రంలో నియోజకవర్గ పరిశీలకులు వరుపుల సుబ్బారావు

అనపర్తి: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రచారయావకు అమాయకులైన ప్రజలు బలైపోతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కందుకూరు, గుంటూరులో జరిగిన టీడీపీ సభల్లో చోటు చేసుకున్న ప్రమాదాలపై చంద్రబాబు తీరును ఎండగట్టారు. కందుకూరు ఘటనలో 8 మంది దుర్మరణం చెందిన ఘటన విస్మరించక ముందే నూతన సంవత్సరం రోజున గుంటూరు పట్టణంలో మరో ముగ్గురు నిరుపేదలు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం తన రాజకీయ లబ్ధికోసం చంద్రబాబు నాయుడు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. గతంలో గోదావరి పుష్కరాల సమయంలో 29 మంది చనిపోవడానికి చంద్రబాబు కారణమయ్యారని అన్నారు. ఈ మరణాలకు చంద్రబాబునాయుడే బాధ్యత వహించాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వార్డు సభ్యుడు ఎస్‌ఎస్‌లు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి

రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 3వ తేదీ మంగళవారం జరిగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని అనపర్తి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వరుపుల సుబ్బారావు, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిలు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారిద్దరూ మాట్లాడుతూ వైఎస్సార్ పింఛన్ కానుక పెంపుదల, లబ్ధిదారులతో నిర్వహించే ముఖాముఖి కార్యక్రమంలో సీఎం జగన్ పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో గల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

టీడీపీ ఇన్‌చార్జి పదవికి మాజీ ఎమ్మెల్యే రాజీనామా



సమావేశంలో మాట్లాడుతున్న పెందుర్తి వెంకటేష్

సీటీఆర్ఐ: పార్టీ అధినేత చంద్రబాబు తనపై అసహనం వ్యక్తం చేయడంతో రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి పదవికి రాజీనామా చేస్తున్నానని మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ ప్రకటించారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గ పార్టీ శ్రేణులతో కలిసి చంద్రబాబుతో ఇటీవల సమావేశమైనప్పుడు మనసు విప్పి మాట్లాడానన్నారు. వారం తర్వాత మరోసారి భేటీ అయినపుడు తనపై చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారన్నారు. పార్టీ ఇన్‌చార్జిగా మరొకరిని నియమించాలని కోరానన్నారు. ఇంతవరకూ ఎవరినీ నియమించలేదన్నారు. తన వలన పార్టీకి నష్టం కలగకూడదన్న ఉద్దేశంతో ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పుకుంటున్నానన్నారు. టీడీపీలోనే కొనసాగుతానని తెలిపారు. పార్టీ కార్యకర్తగా ఉంటూ ఏ పని అప్పగించినా చేస్తానని అన్నారు. మరో పార్టీకి వెళ్లే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు.

లారీని ఢీకొన్న ప్రైవేటు బస్సు

క్లీనర్ మృతి.. ఐదుగురికి గాయాలు

రాజానగరం: జాతీయ రహదారిపై శ్రీరామనగర్ వద్ద ముందు వెళ్తున్న లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఐదుగురు గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి సోమవారం శ్రీకాకుళం వెళ్తున్న బస్సు ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. విజయనగరం జిల్లా బాబామెట్టకు చెందిన బస్సు క్లీనర్ కొత్తపల్లి శ్రీను (35) అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై ఎస్సై సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్కి అవతారంలో భజేనారాయణస్వామి



దశావతారాల్లో దర్శనమిస్తున్న భజేనారాయణస్వామి

రంగంపేట: వడిశలేరులో కొలువైయున్న శ్రీదేవి-భూదేవి సమేత భజేనారాయణ స్వామిని సోమవారం కల్కి అవతారంలో అలంకరించారు. దశావతారాలు చివరి రోజు కావడంతో మొత్తం దశావతారాలను ఆలయంలో ప్రదర్శించారు. ఆలయ అర్చకుడు చిలకమర్రి మురళీకృష్ణమాచార్యులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కల్కి, దశావతారాల్లో ఉన్న స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పేకాట శిబిరాలపై దాడి

సీతానగరం: మండలంలోని రాపాక, ముగ్గళ్లలో పేకాట శిబిరాలపై దాడులు చేసినట్టు ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం రాత్రి రాపాక పంచాయతీ పరిధి శ్రీరామనగరంలో పేకాటాడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ 12,440, ముగ్గళ్లలో ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ 5,500 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామన్నారు.